క్లుప్తంగా

7న మండల పరిషత్ సమావేశం

నరసరావుపేటరూరల్: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 7వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. శాఖల వారీగా సమీక్షతో పాటు అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలపై చర్చిస్తామని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

సూపరింటెండెంట్‌గా డాక్టర్ సురేష్‌కుమార్



నరసరావుపేట: కలెక్టరేట్ సమీపంలోని 200పడకల ఏరియా ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్‌గా డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హాస్పిటల్‌లో నేత్ర వైద్యులుగా పనిచేస్తూ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు సూపరిండెంట్‌గాను, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణ అధికారి (డీసీహెచ్ఎస్)గా పనిచేస్తున్న డాక్టర్ బీవీ రంగారావు నుంచి చార్జి తీసుకున్నారు. డాక్టర్ రంగారావును ఇటీవలనే గుంటూరు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. ఆర్ఎంవో డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ దయానిధి పాల్గొన్నారు.

విజయవంతంగా క్రైస్తవ శాంతి ర్యాలీ



వినుకొండ: క్రైస్తవ సమాజ ఐక్యతను చాటిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా వినుకొండ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న ఆర్‌సీఎం జీవాలయం నుంచి ప్రారంభమైన శాంతి ర్యాలీ వెన్నెల సూపర్ మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, శివయ్య స్థూపం ఏరియాల మీదుగా సాగుతూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జేఏసీ నాయకులు పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పాస్టర్లు, పలు సంఘాల నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్ -కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం క్రింద ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ బి.రవి . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా రాణి



నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని సెయింటాన్స్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొత్తపల్లి రాణి 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాయం పరిధిలో ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డుకు ఎంపికయ్యారు. వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.ఆంతోనమ్మ, అధ్యాపకులు రాణిని అభినందించారు.

వినుకొండ యార్డు చైర్మన్‌గా మురళీకృష్ణ

నూజెండ్ల: మండలంలోని తల్లార్లపల్లి గ్రామానికి చెందిన మీసాల మురళీకృష్ణ యాదవ్‌కు వినుకొండ మార్కెటు యార్డు చైర్మన్ పదవి వరించింది. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన 38 మార్కెటు యార్డు కమిటీలు ప్రకటించింది. ఈక్రమంలో మీసాల మురళీకృష్ణ యాదవ్ పేరు ఉండటంతో నూజెండ్ల మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేయటంతో పాటు ప్రత్యేకంగా అభినందించారు.

దాహార్తి తీర్చేందుకు...



తారక రామానగర్‌లోని రాయల్ పార్క్ అపార్ట్‌మెంట్ నందు నివసిస్తున్న వారు పట్టణంలోని పల్నాడు రోడ్డులో గల కాలువ కట్ట వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ప్రారంభించారు. మూడు నెలల పాటు చలివేంద్రంలో మినరల్ వాటర్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చలివేంద్ర కమిటీ వెంకటనారాయణ, దిలీఫ్‌కుమార్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. – వినుకొండ

జగదంబా... పాహిమాం...

మండలంలోని గుర్రంవారిపాలెం గ్రామంలో పోలేరమ్మ, పేరంటాళ్లమ్మ అమ్మవారి దేవాలయాలు వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు పొంగించి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి పసుపు-కుంకుమ బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిష్టా వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన సంతర్పణ నిర్వహించారు. మూల విరాట్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. -శావల్యాపురం



భూసారం పెంచేందుకు..



ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా పీఎండీఎస్ (నవ ధాన్య) విత్తనాల కిట్స్ మార్కెట్ యార్డులో తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అదనపు మేనేజర్ ప్రేమ్‌రాజు, వినుకొండ మండల వెలుగు ఏపీఎం రామాంజనేయులు, శావల్యాపురం ఏపీఎం వాసుబాబు, జిల్లా శిక్షకులు సూఐదయ్యలు హాజరయ్యారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైనర్ తిరుపతిరావు, శివలక్ష్మి, లక్ష్మీదుర్గ, తదితరులు పాల్గొన్నారు. -వినుకొండ

రహదారికి మరమ్మతులు

మండలం కేంద్రం శావల్యాపురం గ్రామంలోని రక్షిత మంచినీటి చెరువు దగ్గర నుంచి కొత్తలూరు గ్రామం వెళ్లే రోడ్డు మార్గంలో పోట్లూరు డొంక (కొండ వాగు) సమీపం వరకు రహదారి మరమ్మతు పనులు ప్రారంభించినట్లు ఆర్‌అండ్‌బీ ఈఏ కంచేటి నవ్య శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పోట్లూరు డొంక వరకు 1500 మీటర్ల మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మండల పరిధిలోని మతుకుమల్లి గ్రామం నుంచి కారుమంచి గ్రామం ఏల్చూరు కొండ వరకు 9.8 కిలోమీటర్ల ప్యాచ్ పనులు ఈనెలాఖారులోగా పూర్తి చేస్తామన్నారు. ఇందుకుగాను రూ.105 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. – శావల్యాపురం



నాలుగు దశాబ్దాల కోదండ రాముడు

- గణపవరంలో కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు
- సిద్ధమైన చలువ పందిరి
- సాంస్కృతిక కార్యక్రమాల రూపకల్పన

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ మహాగణపతి వాసవీ కన్యకాపరమేశ్వరి కోదండ రామస్వామి దేవస్థానంలో ఈ నెల 6న శ్రీరామ నవమిని పురస్కరించుకుని కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు నలభై ఏళ్ల కిందట గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు రాష్ట్రంలో వైభవంగా జరిగే అతికొద్ది ప్రాంతాల్లో గణపవరం ఒకటన్నారు. అప్పట్లో శ్రీరామ మందిరం ఉండేది. మందిరం ముందు చలువ పందిళ్లు వేసి ఐదు, ఏడు, తొమ్మిది రోజుల పాటూ వేడుకలు నిర్వహించేవారు. అప్పట్లో నవమి సందర్భంగా జాతీయస్థాయిలో ఎడ్ల బలప్రదర్శన నిర్వహించేవారు. ప్రతిరోజూ ఉదయం పూజలతో పాటూ సాయంత్రం హరిశ్చంద్ర, చింతామణి, శ్రీరామాంజనేయ యుద్ధం వంటి పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించి, చివరిరోజున ఎడ్ల పోటీల్లో గెలుపొందిన యజమానులకు బహుమతులు అందించేవారు.



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

తిరిగి 40 ఏళ్ల తర్వాత...

రూ.3 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో నవమి వేడుకలు నిర్వహించనున్నారు. కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు బృందం ఆధ్వర్యంలో ఆలయ పూజారి దర్శి అనిల్‌కుమార్ క్రతువు నిర్వహించనున్నారు. తొలిరోజు ఆదివారం స్వామి వారికి అభిషేకం అనంతరం కల్యాణ మహోత్సవం నలభై జంటలతో నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు గణపవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కోలాట ప్రదర్శన, నాగరాజ భజన సమాజం వారిచే భజనా కార్యక్రమాలు జరగనున్నాయి. రెండోరోజు సోమవారం ఉదయం



ఏర్పాటైన చలువ పందిరి, విద్యుత్ దీపాలంకరణ

ప్రత్యేక పూజల అనంతరం గోత్రనామ పూజలు, రాత్రి 9 గంటలకు గుడివాడ, విజయవాడకు చెందిన కళా బృందాలతో భరతనాట్య ప్రదర్శన, శ్రీకృష్ణ నృత్యరూపకం, మూడో రోజు మంగళవారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం మాచర్ల రంగారావు బృందంతో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి భజన, నాలుగోరోజు బుధవారం తెనాలి విజయలక్ష్మీ నాట్యమండలి వారిచే నంది అవార్డు గ్రహీత దీపాల సుబ్రహ్మణ్యం మూడు నాటక ప్రదర్శనలు జరగనున్నాయి. చివరిరోజు గురువారం విఘ్నేశ్వర మహిళామండలి వారిచే కోలాట ప్రదర్శన జరగనుంది.

రేపు బోయపాలెంలో ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు: ఈనెల 6వ తేదీన బోయపాలెం గ్రామం వాల్మీకి నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ సీతా రామాలయ దేవస్థానం 11వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము 5 గంటల నుంచి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు మొదలవుతాయన్నారు. గ్రామానికి చెందిన సీతారామ భక్తసమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, పంచామృత స్నపన, కుంకుమార్చన, 11 గంటలకు సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు వార్షికోత్సవ వేడుకలకు హాజరైన భక్తులకు మహా అన్న సంతర్పణ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.



సీతారామాలయ దేవస్థానం

గ్రామపెద్దల సహకారంతో నిర్వహించే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

బొల్లాపల్లి: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.సీతారామయ్య అన్నారు. మండలంలోని గుట్లపల్లి, రావులాపురం సచివాలయాలను ఆయన శుక్రవారం సందర్శించారు. సచివాలయాల పని తీరుపై సమీక్ష, పి–4 సర్వే, పీపుల్స్ వర్క్ ఫ్రం హోంసర్వేలపై సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సిబ్బందితో కలిసి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, సచివాలయ సేవలు సక్రమంగా అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పి–4 సర్వేలో మండలంలోని 33 పంచాయితీల్లో 74శాతం సర్వే పూర్తియిందని, 16171 నివాసాలకు గాను 18 ఏళ్లు పైబడిన 36,174 మంది ప్రజలు ఉన్నారని వీరిలో 27081ని సర్వే చేశామన్నారు. మండలంలో ప్రజలు ఇంటి వద్ద నుంచి పనిచేసే వివరాలను సేకరణ సర్వే నిర్వహణ కొనసాగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు.



గుట్లపల్లిలో పీపుల్స్ వర్క్‌ఫ్రం హోం సర్వేలో ఇన్‌చార్జి ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది

బీజేపీ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువు

చిలకలూరిపేట: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువైందని, వక్ఫ్ సవరణ బిల్లు పేరుతో ముస్లిం మైనార్టీల హక్కులు కాలరాస్తున్నారని సీపీఐ ఇన్‌చార్జి ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తం ప్రచార ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రచారజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల హక్కులు, స్వేచ్ఛను కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతూ వక్ఫ్ బిల్లును తెరపైకి తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేంద్ర అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ విస్తారంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో తిప్పి కొట్టాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, కందిమళ్ల వెంకటేశ్వర్లు, చౌటుపల్లి నాగేశ్వర రావు, ముసాబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారజాతాలో సీపీఐ నాయకులు

కృష్ణవేణిలో సినిమా ప్రమోషన్ ఈవెంట్

నరసరావుపేట ఈస్ట్: జీవితంలో పెను ప్రమాదాలకు కారణమయ్యే చిన్న చిన్న పొరపాట్లను కాలం అవకాశం ఇచ్చినప్పుడు వాటిని సరిదిద్దుకొని ఎదగటం కథాంశంగా 23 సినిమాను రూపొందించినట్లు సినీ దర్శకుడు రాజ్.ఆర్ తెలిపారు. చిలకలూరిపేట రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శుక్రవారం 23 సినిమా తొలి ప్రమోషన్ ఈవెంట్ నిర్వహించారు. హీరో రాయపాటి తేజ, దర్శకుడు రాజ్.ఆర్ ఇతర చిత్ర యూనిట్ సభ్యులు ఈవెంట్‌కు హాజరయ్యారు. ఈసందర్భంగా దర్శకుడు రాజ్.ఆర్ మాట్లాడుతూ, జీవితంలో చేసే చిన్నచిన్న పొరపాట్లు పెను ప్రమాదాలకు దారితీస్తాయనీ, వాటిని సరిదిద్దుకునే అవకాశం కాలం కల్పిస్తుందన్నారు. కాలం ఇచ్చిన రెండవ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎదగాలనే అంశంతో చిత్రం రూపొందించామన్నారు. చిలకలూరిపేట బస్సు దగ్ధం ఘటన ప్రధానాంశమని స్పష్టం చేశారు. హీరో రాయపాటి తేజ మాట్లాడుతూ, సినిమా అందర్నీ ఆకట్టుకుంటుందని తెలిపారు. తమ సినిమా కథాంశంతో ముడిపడి ఉన్న ప్రాంతంలో తొలి ప్రమోషన్ ఈవెంట్ నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా హీరో తేజ, దర్శకుడు రాజ్.ఆర్ కళాశాల విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు హీరో తేజను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో రమేష్ హాస్పటల్ డిప్యూటీ మేనేజర్ ఆర్.మమత, యాంకర్ దీప్తీ, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్ బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో భూముల పరిశీలన

యడ్లపాడు: మండలంలోని రెండు గ్రామాల్లో నరసరావుపేట ఆర్డీవో మధులత పర్యటించారు. తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న వసంత ఇండస్ట్రీస్ నూలు మిల్లు యాజమాన్యం సర్కారు డొంకను తమ సొంత అవసరాలకు తీసుకుని, మరోచోట తమ సొంత స్థలాన్ని సర్కారు డొంక నిమిత్తం ఇచ్చేందుకు గతంలో రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. దీనిపై రెవెన్యూశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం తిమ్మాపురంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభలో మండల అధికారులతో కలిసి ఆర్డీవో పాల్గొన్నారు.

భూసేకరణలో పరిహారం దక్కలేదంటూ...

తుర్లపాడు గ్రామంలో పాతికేళ్ల కిందట నిర్మాణం చేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డులో అదే గ్రామానికి చెందిన తల్లపనేని పద్మలత పొలంలోని కొంత భూమి కోల్పోయింది. సదరు బాధితురాలు తనకు నష్టపరిహారం అందించాలంటూ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో సదరు భూమిని అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవో బి.హేమలతాదేవి, ఆర్ఐ సుబ్బారావు, మండల రెవెన్యూ సర్వేయర్ గేరా సురేంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ: నియోజకవర్గంలోని వినుకొండ, బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం, నూజెండ్ల మండలాల్లో, పట్టణ శివారు కాలనీల్లో లైసెన్స్ కలిగిన మద్యం షాపుల యజమానులు విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలాల్లోని గ్రామాల్లో, తండాల్లో మద్యం ఏరులై పారుతుందని, అక్కడ మంచినీరు లేకపోయినా మద్యం మాత్రం బాగా దొరుకుతుందని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్పందించి బెల్టుషాపులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, బీసీ నాయకులు వెంకట్రావు తదితరులు ఉన్నారు.

నవోదయకు కంభంపాడు విద్యార్థి

నూజెండ్ల: మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన కీర్తిపాటి ప్రైసి నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణిత సాధించినట్లు ఎంఈవో మద్దికుంట సాంబశిరావు శుక్రవారం తెలిపారు. నవోదయలో సీటు సాధించటం పలువురు విద్యార్థులకు ఆదర్శమన్నారు. అభినందించిన వారిలో భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి,యల్లమంద, రంగారావులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కారుమంచి క్రీడాకారుడు



శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన మల్లాపరపు విజయ్ రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పల్నాడు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు గ్రామవాసి కోచ్ సభ్యుడు మల్లాపరపు కిషోరులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న సత్తెనపల్లి పట్టణంలోని శాంతి నికేతన్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన జిల్లా క్రికెట్ ఎంపిక పోటీలో కీపర్, బ్యాటింగ్‌లో మంచి ప్రతిభ కనపరిచినందుకు జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 5,6 తేదీలలో పిడుగురాళ్ళ పట్టణంలోని జానుపాడు రోడ్డులో తిరుమల ఆక్స్‌ఫర్డు స్కూల్లో జరిగే రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో పాల్గొంటారన్నారు.

చిత్రకారుడు జెస్టిస్‌కు అరుదైన గౌరవం



వినుకొండ : పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్శిటీ హైదరాబాదలో జెస్టిస్ చిత్రించిన చాకలి ఐలమ్మ 6''4 అడుగుల వర్ణ చిత్రం, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ బి.సంధ్య విప్లోవ్ రాసిన 20 ఇంగ్లిష్ కవితలు జెస్టిస్ బ్రష్‌తో చిత్రించారు. ఐలమ్మ యూనివర్శిటీ దర్బార్ హాల్లో శాశ్వతంగా కొలువుతీరింది. ఈ చిత్ర ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రముఖ నటుడు, సినీ దర్శకులు బి.నరసింగరావు, ప్రముఖ సినీరచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రొ. కంచ ఐలయ్య డాక్టర్ సంధ్య విప్లోవ్, డాక్టర్ హరి తదితరులు పాల్గొని జెస్టిస్‌ను అభినందించారు.

వక్ఫ్ ఆస్తులు కబళించే కుట్ర

చిలకలూరిపేట: వక్ఫ్ సవరణ బిల్లు పేరుతో ముస్లింల సంక్షేమ కార్యక్రమాల కోసం దానం ఇచ్చిన ఆస్తులను కబళించే కుట్ర జరుగుతోందని ముస్లిం జేఏసీ నాయకుడు షేక్ అబ్దుల్ జబ్బార్ విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ, అవాజ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకిక స్ఫూర్తి, మత స్వేచ్ఛ, సమానత్వం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కే కార్యక్రమమే ఈ బిల్లు ఉద్దేశమని వివరించారు. ఇప్పటికే దేశంలోని వక్ఫ్ భూముల్లో 50 శాతం అన్యాక్రాంతమయ్యాయని, ఉదాహరణకు ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ అనే ప్రభుత్వ సంస్థ ఢిల్లీలోని 30 శాతం వక్ఫ్ భూములను ఆక్రమించుకున్నదని పేర్కొన్నారు. ఈ బిల్లుతో దేశవ్యాప్తంగా ఇలాంటి ఆక్రమణలకు అవకాశం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పత్రాలు లేని భూములు వక్ఫ్ ఆధీనంలో ఉంటే అది వక్ఫ్ ఆస్తిగానే పరిగణించబడుతుందని, ఇప్పుడు ఈ బిల్లు కారణంగా వక్ఫ్ స్వాధీనంలో ఉన్న ఇలాంటి ఆస్తులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా వక్ఫ్ భూములను పెద్ద స్థాయిలో జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రభుత్వం ఆక్రమించుకోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

పూలే విగ్రహం రెయిలింగ్ పాక్షిక ధ్వంసం

- మిర్చిలారీ వల్ల జరిగిందన్న బీసీ సంక్షేమ నాయకులు

నరసరావుపేట: పల్నాడు రోడ్డులోని పాత బస్టాండ్ సెంటర్‌లో మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం చుట్టూ ఏర్పాటుచేసిన రెయిలింగ్‌ను శుక్రవారం మిర్చిలోడుతో వెళుతున్న లారీ ఢీకొనటంతో రెయిలింగ్‌లో కొంతభాగం దెబ్బతిందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను పేర్కొన్నారు. తమకు తెలిసిన వెంటనే విగ్రహాన్ని పరీక్షించగా దానికి ఎటువంటి డామేజ్ జరగలేదన్నారు. కేవలం స్టీల్ రైలింగ్ మాత్రమే పాక్షికంగా దెబ్బతిందన్నారు. దీనిపై ఒన్‌టౌన్ సీఐ, ట్రాఫిక్ సీఐలతో విషయం తెలియచేసి దీనికి కారణమైన లారీ వివరాలు సేకరించాలని కోరామన్నారు. కావున ఈ విషయంపై ఎటువంటి అపోహలు చెందవద్దని బీసీ వర్గీయులను ఆయన కోరారు.



పూలే విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన రెయిలింగ్ దెబ్బతిన్న దృశ్యం

కార్మికులపై ఇంత నిర్లక్ష్యం తగదు

- 16వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షలు

నరసరావుపేట: పరిసరాలను శుభ్రం చేసి ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు అధికారుల నిర్లక్ష్యం తగదని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి అన్నారు. సమాన పనికి సమాన వేతనం పనిచేసిన అన్ని దినాలకు వేతనాలు సక్రమంగా ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం 16వ రోజు చేరాయి. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ కార్మికుల పేర్లు ఆప్కాస్‌లో ఉన్నప్పటికీ సగం రోజులకే వేతనాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన కార్మికులను ఆకాశానికి ఎత్తిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ప్రస్తుతం నిర్లక్ష్యం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనికి సరైన వేతనం ఇవ్వకుంటే కార్మికులు ఎలా బతకాలని, సమాన పనికి సమాన వేతనం రూ. 21వేలు ఇవ్వాలన్నారు. ఆరేళ్లుగా పనిచేస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయడంలో తాత్సారం తగదన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులతో పాటు వీరి పేర్లు ఏపీ ఔట్‌సోర్సింగ్ కార్పోరేషన్‌లో నమోదైనా వివక్ష ఎందుకని ప్రశ్నించారు. పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో నరసింహారావు, జె.శ్రీను, వై.ఇంద్రయ్య, కె.మరియదాసు, కె.దేవదానం, సమాధానం, సాల్మన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

నాదెండ్ల: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల వేతన బకాయిలను వెంటనే చెల్లించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు నాదెండ్లలో శుక్రవారం ఎంపీడీవో స్వరూపరాణికి వినతిపత్రం అందించారు. ఉపాధి హామీ పథకం కూలీల సమస్యల పరిష్కారం కోసం బైక్ యాత్ర నాదెండ్ల చేరుకున్న సందర్భంగా నాయకులు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో రాజకీయ జోక్యం నివారించి అందరికీ పని కల్పించాలన్నారు. చట్ట ప్రకారం ఉపాధి పనుల్లో దళిత గిరిజనులకు మొదటి ప్రాధాన్యతనివ్వాలన్నారు.

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివనాగరాణి, జిల్లా అధ్యక్షుడు కారసాల రోశయ్య, కార్యదర్శి బాబు, నాయకులు భగత్, ఏపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.